# ప్లాస్టిక్ భూతం

## పర్యావరణాన్ని మింగేస్తున్న ప్లాస్టిక్ వస్తువులు

**మార్కెట్లో రూ.10కు ఏ వస్తువును కొనుగోలు చేసినా దానిని ప్లాస్టిక్ క్యారీబ్యాగ్‌లో వేసుకుని, చేత్తో స్టైల్‌గా ఊపుకుంటూ ఇంటికి తీసుకెళ్తారు. అయితే ఆ ప్లాస్టిక్ సంచులు ఏమవుతున్నాయి. చెత్త కుప్పల్లో వేసే ఆ సంచులు భూమిలో కలవకపోగా పర్యావరణానికి చేటుగా మారుతున్నాయి.**


కీడు కలిగించే ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు

**గుడ్లవల్లేరు:** ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు భూమిలో కలిసే అవకాశం లేక పర్యావరణాన్ని మింగేస్తున్నాయి. వీటికి ప్రత్యామ్నాయంగా నార సంచులు మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. అయితే వాటిని ఎక్కువ మంది వాడటం లేదు. ప్లాస్టిక్ క్యారీ బ్యాగులే గాక వివిధ ఫంక్షన్లలో భోజనాలు పెట్టే సమయంలో వాడే టేబుల్ రోల్స్, విస్తర్లు, తాగునీటి గ్లాసులు, టీ గ్లాసులు, టిఫిన్ ప్లేట్లు, స్నాక్స్ బౌల్స్‌తో సహా ప్లాస్టిక్‌వే. వీటికి కూడా ప్రత్యామ్నాయంగా పేపరు టేబుల్ రోల్స్, విస్తర్లు, తాగునీటి గ్లాసులు, టీ గ్లాసులు, టిఫిన్ ప్లేట్లు, స్నాక్స్ బౌల్స్ అందుబాటులోనే ఉన్నా ధరలు అధికంగా ఉన్నాయని వినియోగదారులు వాటి జోలికి పోవడం లేదు. దీంతో పర్యావరణాన్ని నాశనం చేసే ప్లాస్టిక్ వాటినే వాడుతూ తమ భావి జీవితాలను హరించుకుంటున్నారు. వీటి వలన నివాస ప్రాంతాలతో పాటు సాగు భూములు, పంట కాల్వలు, డ్రెయిన్లు నిండిపోయి, పర్యావరణం దెబ్బ తింటోంది.

**క్యాన్సర్ వచ్చే అవకాశం**

ప్లాస్టిక్ గ్లాసులో టీ తాగితే క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. అలాంటి విషపూరితమైనవి, భూమిలో కుళ్లిపోని ప్లాస్టిక్ చెత్త వలన వచ్చే నష్టాన్ని వినియోగదారులు గ్రహించాలి. వీటికి బదులుగా భూమిలో కలిసిపోయే పేపర్, అట్టతో తయారయ్యే విస్తర్లు, గ్లాసులను వాడటమే. ఈ విషయంపై అధికారులు, పాలకులు ప్రచారం సాగించాలని పర్యావరణ వేత్తలు అభిప్రాయపడుతున్నారు.

**పశువులకు తప్పని తిప్పలు**

ప్లాస్టిక్ వినియోగంతో మనుషులకే కాదు నోరు లేని పశువులు కూడా ఇబ్బంది పడుతున్నాయి. వీటి వినియోగం వలన ఆవులు, మేకలు అస్వస్థతకు గురవుతున్నాయి. మానవత్వంతో మూగజీవాలను కాపాడుకోవాలంటే ప్లాస్టిక్‌ను తప్పక నిషేధించాలి. క్యారీబేగ్స్‌లో తినేసిన వస్తువులను కట్టి, పారేయటంతో పశువులు నోటితో ఆ పొట్లాలను విప్పలేక ఆహార పదార్థాల వాసనకు ఆ పొట్లాలను మింగేసి, అస్వస్థతకు గురవుతున్నాయి. వ్యాపారులు కూడా ఈ విషయాన్ని గమనించి ప్లాస్టిక్ సంచులను వాడకూడదు. అసలు ఈ ప్లాస్టిక్ వస్తువులను తయారు చేసే కంపెనీలకు ప్రభుత్వం లైసెన్సులు రద్దు చేయాలని ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు.


ప్లాస్టిక్ వ్యర్థాలను తింటున్న ఆవు


భూమిలో కలిసే నార కవర్లు

### అతిక్రమిస్తే జరిమానాలు తప్పవు



ప్లాస్టిక్ వాడకం వలన కలిగే నష్టంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు దుకాణాల వెంట తిరుగుతున్నాం. దుకాణదారులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. ప్లాస్టిక్ వాడకంపై సంభవిస్తున్న ప్రమాదాలను వివరిస్తున్నాం. అయినా నిబంధనలు అతిక్రమించే వ్యాపారులకు జరిమానాలు తప్పవని హెచ్చరిస్తున్నాం.

– నరసింహారావు,
గ్రామ కార్యదర్శి, గుడ్లవల్లేరు

## సమస్యల పరిష్కారానికి చర్యలు


తటివర్రులో అర్జీలను స్వీకరిస్తున్న రెవెన్యూ అధికారులు


పోలుకొండ సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాము


కొట్టాడ రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి నాగలింగాచార్యులు

**గుడివాడరూరల్:** గ్రామాల్లో రెవెన్యూపరమైన సమస్యలు పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని తహసీల్దార్ వాసిరెడ్డి రామ కోటేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని తటివర్రులో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ రైతులు భూ పరమైన సమస్యలను సదస్సుల్లో విన్నవించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ నాగబాబు పాల్గొన్నారు.

**వెణుతురుమిల్లిలో..**

**గుడ్లవల్లేరు:** రైతుల చెంతకు వచ్చి వారికున్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకు గ్రామాల్లోకి వచ్చి సదస్సులను నిర్వహిస్తున్నామని తహసీల్దార్ బి.లోకరాజు అన్నారు. మండలంలోని వెణుతురుమిల్లిలో రెవెన్యూ సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ సదస్సులో తహసీల్దార్ మాట్లాడుతూ దీర్ఘకాలికంగా ఉన్న భూ సమస్యలను కూడా ఈ సదస్సుల్లో తీరుస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఐ పి.శివకుమార్, సర్వేయరు పర్వీన్ సుల్తానా పాల్గొన్నారు.

**మండవల్లిలో..**

**మండవల్లి:** రైతు సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని ఇన్‌చార్జి తహసీల్దార్ కె.గోపాల్ అన్నారు. మండలంలోని పెనుమాకలంకలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో వీఆర్వో పి.శ్రీనివాసరావు, రీసర్వే డీటీ సుధారాణి, వీఆర్వోలు పాల్గొన్నారు.

**నందివాడలో..**

**నందివాడ:** భూ సమస్యల పరిష్కారమే రెవెన్యూ సదస్సుల ఉద్దేశమని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. మండలంలోని పోలుకొండలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ గురుమూర్తిరెడ్డి, డీటీ మల్లిక, స్పెషల్ ఆఫీసర్ వెంకట్రావు, ఆర్ఐ గణేష్ పాల్గొన్నారు.

**కైకలూరులో..**

**కైకలూరు:** రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకుని సమస్యలను పరిష్కరించుకోవాలని జిల్లా ఫిషరీస్ జాయింట్ డైరెక్టర్, కైకలూరు మండల ప్రత్యేకాధికారి కేఎస్‌వీ నాగలింగాచార్యులు పేర్కొన్నారు. మండలంలోని కొట్టాడ గ్రామంలో రెవెన్యూ సదస్సు బుధవారం నిర్వహించారు. గ్రామంలో భూములను రీసర్వే చేయాలని, అర్హులైన వారికి పింఛన్లు కల్పించాలని, రోడ్ల నిర్మాణం చేయాలని మొత్తం 25 అర్జీలను సదస్సులో గ్రామస్తులు అందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దారు ఎండీ.ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గీతాజయంతి వేడుకలు


బుచ్చమ్మ ఆశ్రమంలో రాధాకృష్ణులు


పామర్రు విష్ణాలయంలో భక్తుల గీతాపారాయణ


వడాలి శ్రీజగన్నాథస్వామి ఆలయంలో విష్ణుసహస్రనామ పారాయణ

**పామర్రు:** గీతాజయంతిని బుధవారం పలు ఆలయాల్లో ఘనంగా నిర్వహించారు. స్థానిక విష్ణాలయంలో బాల భక్త గీతా సమాజం సభ్యుల ఆధ్వర్యంలో భగవత్ గీత పారాయణ చేశారు. రాజేశ్వరి ఆధ్వర్యంలో గీతతో పాటు హనుమాన్ చాలీసా, కృష్ణాష్టకం, సూర్యాష్టకాలను పఠించారు. స్థానిక విజయవాడ రోడ్డులోని బుచ్చమ్మ ఆశ్రమంలోని కృష్ణ మందిరంలో గీతాజయంతిని పురస్కరించుకుని అర్చకులు శ్రీమన్‌నారాయణాచార్యులు ఆధ్వర్యంలో విశేష కార్యక్రమాలను నిర్వహించారు.

**విష్ణు సహస్రనామ పారాయణ**

**ముదినేపల్లి రూరల్:** మండలంలోని వడాలి శ్రీజగన్నాథస్వామి ఆలయంలో బుధవారం విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు. ఆలయ కార్య నిర్వహణాధికారి శింగనపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శింగనపల్లి మాట్లాడుతూ రాబోయే ధనుర్మాసం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని తెలిపారు.

## ఎస్ఏ-1 పరీక్షలు ప్రారంభం


వడాలి జెడ్పీ హైస్కూల్లో పర్యవేక్షణ చేస్తున్న ఎంఈఓ


కూచిపూడిలో పరీక్షలను పరిశీలిస్తున్న ఎంఈఓ శ్రీలక్ష్మి

**ముదినేపల్లి రూరల్:** మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఏ-1 (సమ్మెటివ్ అసెస్మెంట్) పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు తెలుగు పరీక్షను మూడు నుంచి తొమ్మిదో తరగతి వరకు నిర్వహించారు. ఎంఈఓ కె.నరేష్‌కుమార్ వడాలి జెడ్పీ హైస్కూల్లో నిర్వహించే పరీక్షలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సందేహాలను నివృత్తి చేశారు. హెచ్ఎం వి ప్రభుదాస్, సీనియర్ ఉపాధ్యాయుడు సీహెచ్ నాగమల్లేశ్వరరావు పరీక్షలు నిర్వహిస్తున్న విధానాన్ని ఎంఈఓకు వివరించారు.

**కూచిపూడిలో..**

**కూచిపూడి(మొవ్వ):** విద్యాశాఖ ఆధ్వర్యంలో సమ్మెటివ్-1 పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ నెల 19వ తేదీ వరకు జరిగే ఈ పరీక్షలు మొవ్వ మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలలోని ఒకటి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరయ్యారు. ఎంఈఓ-2 కే శ్రీలక్ష్మి కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర జెడ్పీ ఓరియంటల్ హైస్కూల్లో జరిగిన పరీక్ష కేంద్రాలను హెచ్ఎం గుంటూరు వెంకటసత్య ప్రసాద్‌తో కలసి పరిశీలించారు.

## ఘనంగా బాబా విగ్రహ ప్రతిష్ట

**ముదినేపల్లి రూరల్:** మండలంలోని వణుదుర్రు శివారు కొత్తపల్లిలో సాయిబాబా విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటల ప్రాంతంలో ప్రారంభమైన ఈ మహోత్సవానికి పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు.

## అన్నదాతలకు అండగా వైఎస్సార్‌సీపీ


బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

**గుడివాడ టౌన్:** అన్నదాతలకు ప్రభుత్వం నుంచి అందాల్సిన రాయితీలు, ఇతర లబ్ధి అందేలా పోరాడేందుకు వైఎస్సార్‌సీపీ రైతులకు అండగా ఉంటుందని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఎంవీ నారాయణరెడ్డి అన్నారు. స్థానిక బయ్యావారి వీధిలోని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు కార్యాలయంలో బుధవారం అన్నదాతలకు అండగా వైఎస్సార్‌సీపీ బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను పూర్తిగా తుంగలో తొక్కిందన్నారు. గత ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా దళారీవ్యవస్థ లేకుండా రైతులు పండించిన పంటను కొనుగోలు చేసి రైతులకు అండగా నిలిచిందన్నారు. కూటమి ప్రభుత్వం పంట బీమా ప్రీమియం చెల్లించకుండా రైతు భరోసా సాయం అందించకుండా, ధాన్యం కొనుగోలులో దళారుల వ్యవస్థ చొప్పించి రైతుకు తీవ్ర నష్టం కలిగిస్తుందన్నారు. వాటిపై పోరాడేందుకు రైతులకు పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కె. ఆంజనేయ ప్రసాదు, వెంపటి సైమన్, చుండూరి శేఖర్, బాజీ, బాషా, అబ్దుల్లా బేగ్, ఎస్‌కె సయ్యద్, పి. ప్రశాంత్, రమణకుమార్, టి. యెషయ్య, సురేఖ, ఎల్. జర్మియ తదితరులు పాల్గొన్నారు.

## రేపు గ్రంథాలయ ఉద్యోగుల సమావేశం

**గుడివాడ టౌన్:** కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు సమావేశం, ఎన్నిక శుక్రవారం నిర్వహించనున్నట్లు ఉద్యోగుల సంఘం పూర్వ అధ్యక్షుడు బీరం వెంకటరమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ ఠాగూర్ మెమోరియల్ గ్రంథాలయంలో ఉదయం తొమ్మిది గంటలకు ఈ సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. సంఘం రాష్ట్ర నాయకులు హాజరై ఎన్నికలు నిర్వహిస్తారని, ఉద్యోగులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

## తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్న ఎన్నికల సామగ్రి



**గుడ్లవల్లేరు:** రైతులకు ఈ నెల 14న నిర్వహించనున్న సాగునీటి సంఘాల ఎన్నికల సామగ్రి మండల కేంద్రానికి చేరుకుంది. గతంలో వరుసగా ప్రభుత్వం వాయిదా వేస్తూ వచ్చిన ఈ ఎన్నికలపై రైతుల్లో అసహనం నెలకొంది. గత నెల్లో ఎన్నికలను రెండు సార్లు వాయిదా వేశారు. దీంతో రైతులు ఈ ఎన్నికలపై ఆసక్తిని కనబరచలేదు. తీరా ఎన్నికల మెటీరియల్‌తో సహా బుధవారం గుడ్లవల్లేరు తహసీల్దార్ కార్యాలయానికి రావటంతో రైతుల్లో సాగునీటి ఎన్నికల సందడి ఊపందుకుంది.

## క్లుప్తంగా

### లలిత బృందం సభ్యులకు సన్మానం



**పామర్రు:** పద్మశ్రీ ఘంటసాల ఎన్టీఆర్ కళాపీఠం వారి ఆధ్వర్యంలో స్థానిక హితమ్ పాఠశాల్లో లలిత బృందం సభ్యులను బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కళాపీఠం అధ్యక్ష, కార్యదర్శులు కాటూరి వెంకటమురళీకృష్ణ, నందిపాటి హేమంత్‌రెడ్డి మాట్లాడుతూ అంతరించిపోతున్న కళాకారులను గుర్తించి, వారిని సత్కరించడం కళాపీఠం లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో కళాపీఠం సభ్యులు శ్రీలక్ష్మీ, తనూజ తదితరులు పాల్గొన్నారు.

### విద్యుత్ సరఫరాలో అంతరాయం

**గుడివాడ టౌన్:** రైల్వే ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణ పనుల కారణంగా రెండు రోజులు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఎలక్ట్రికల్ ఈఈ జీబీ శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. పట్టణంలోని పామర్రు రోడ్, పెద్ద కాల్వ సెంటర్, ఆర్టీసీ కాలనీ తదితర ప్రాంతాల్లో ఈ నెల 12, 13 తేదీల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

### క్రీస్తు బోధనలు ఆదర్శం



**పామర్రు:** ఏసుక్రీస్తు బోధనలు ఆదర్శంగా ఉండాలని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. స్థానిక నల్లగుంట గురుకుల పాఠశాల రోడ్డులోని ఎబినేజర్స్ న్యూలైఫ్ గ్రౌండ్ నందు జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఏసు చూపిన మార్గంలో పయనించి దయ, క్షమ, శాంతి గుణాలను కల్గి ఉండాలన్నారు. అనంతరం అందరూ కలిసి క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. శాంతికి చిహ్నంగా అందరూ కలిసి క్రిస్మస్ క్యాండిల్స్‌ను వెలిగించి ప్రదర్శించారు.

### ప్రాథమిక చికిత్స సక్రమంగా ఉండాలి



**గుడివాడ టౌన్:** గ్రామీణ వైద్యులు ప్రాథమిక వైద్య సేవల విషయంలో పలు జాగ్రత్తలు పాటించాలని ఐఎంఏ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బి. శ్రీనివాసాచార్యులు అన్నారు. బుధవారం స్థానిక ఆంజనేయ ఫంక్షన్ హాల్లో బేసిక్ మెడికల్ ప్రాక్టిషనర్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ గుడివాడ ఏరియా సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ గ్రామీణ వైద్యులు తమ పరిధిలో మాత్రమే వైద్య సేవలందించాలన్నారు. రాష్ట్ర ఫెడరేషన్ అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు, నాయకులు ఎన్.ఉమాశంకర్, ఎస్ ఉదయ్‌భాస్కరరాజు, కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### వైభవంగా సహస్ర దీపారాధనలు



**ముదినేపల్లి రూరల్:** ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ షష్ఠి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం రాత్రి సహస్ర దీపారాధన, సహస్ర లింగార్చన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ ఆర్.గంగాశ్రీదేవి ఉత్సవ కమిటీ సభ్యులు స్వామికి పూజలు నిర్వహించి సహస్ర దీపారాధన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు లక్ష బిల్వార్చన, రుద్రాభిషేకం కార్యక్రమాలు కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు తోలేటి వీరభద్ర శర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.



### సాగునీటి సంఘాల ఎన్నికలకు సర్వం సిద్ధం

**గుడ్లవల్లేరు:** మండలంలో సాగునీటి సంఘాల ఎన్నికలకు అధికారులు రంగం సిద్ధం చేశారు. ఈ నెల 14 తేదీన ఎన్నికలను నిర్వహించనున్నారు. ఉదయం 8 నుంచి 9గంటల లోపు రైతులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి. 9 గంటల తర్వాత వచ్చే ఓటర్లకు ప్రవేశం లేనట్లే. 17న డీసీ ఎన్నిక తేదీ సిద్ధమైంది. ఓటు హక్కు వినియోగించుకొనుటకు సంబంధిత టీసీ ఓటర్ లిస్ట్‌లో పేరు తప్పనిసరిగా ఉండాలి. ఎన్నికలో పోటీ చేసే అభ్యర్థి నీటి తీరువా శిస్తు పూర్తిగా చెల్లించాలి. చెల్లించకపోతే అనర్హులే.

### 14న సాగునీటి సంఘ ఎన్నికలు

**పమిడిముక్కల:** మండలంలోని ఎనిమిది సాగునీటి సంఘాలకు శనివారం ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ నవీన్‌కుమార్ తెలిపారు. సాగునీటి సంఘాలకు బుధవారం నోటిఫికేషన్ జారీ చేసినట్లు పేర్కొన్నారు. నీటి సంఘాలకు అధ్యక్ష, ఉపాధ్యక్ష, ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు(టీసీలకు) ఎంపికకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

### వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న న్యాయమూర్తి



**గుడివాడ టౌన్:** స్థానిక జగన్నాథపురం పాటి మీద వేంచేసియున్న వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో గుడివాడ సీనియర్ సివిల్ జడ్జి ఎస్. వాసుదేవ్ బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత స్వామిని దర్శించుకుని వేద పండితుల ఆశీర్వచనాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ కె.వేణుగోపాలరావు మాట్లాడుతూ దేవస్థానంలో నిర్వహిస్తున్న వార్షిక ధనుర్మాస కార్యక్రమాలను పురస్కరించుకుని న్యాయమూర్తి ఆలయానికి విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారని తెలిపారు. కార్యక్రమంలో వేదపండితులు వేదాంతం అప్పలాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

### మట్టి ట్రాక్టర్ బోల్తా

**కైకలూరు:** పూడిక పనులకు మట్టి లోడుతో వెళుతున్న ట్రాక్టర్ అదుపుతప్పి పంటబోదెలో బోల్తా పడిన ఘటన రామవరం గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. ఆ సమయంలో వాహనాలు రాకపోవడంతో ప్రమాదం తప్పింది. డ్రైవర్‌కు ఎటువంటి గాయాలు కాలేదు. కాగా మట్టి ట్రాక్టర్లు రహదారిలో తిరగడంతో రహదారులు దెబ్బతింటున్నాయని ప్రజలు వాపోతున్నారు. ట్రాక్టర్ల వేగాన్ని నియంత్రించాలని కోరారు.

### సుస్థిర అభివృద్ధి సాధించండి

**కైకలూరు:** పంచాయతీల్లో అందరూ సమన్వయంతో పని చేసి సుస్థిర అభివృద్ధి సాధించాలని ఎంపీపీ అడవి కృష్ణ పేర్కొన్నారు. మండల పరిషత్ సమావేశ హాల్లో 'స్థానికీకరణ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు' అనే అంశంపై సర్పంచులు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి అవగాహన సమావేశం బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథి ఎంపీపీ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రణాళికను రుపొందించుకుని అభివృద్ధి పనులు చేయాలన్నారు. ఎంపీడీఓ ఆర్. ఫణీంద్ర మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా 2030 నాటికి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించడానికి తొమ్మిది అంశాలపై అవగాహన కలిగిస్తున్నారన్నారు. ఈ నెల 14 వరకు అవగాహన సమావేశాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బలరామరాజు, నాగరాజు, నాగమణి, రాంబాబు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

### రేపు రెడ్డిపాలెంలో హనుమత్ వ్రతాలు

**గుడ్లవల్లేరు:** శ్రీ కొండలమ్మ అమ్మవారి ఆలయ దత్తత దేవస్థానం రెడ్డిపాలెం శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం సామూహిక హనుమత్ వ్రతాలను నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ఆకుల కొండలరావు బుధవారం తెలిపారు. స్వామికి తొలుత విశేషాభిషేకాలతో పాటు ప్రత్యేక పూజలను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధికసంఖ్యలో విచ్చేసి స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని కోరారు.